ఇంతావేస్తే కొత్త ఛైర్మన్ వీరాసామి! తప్పదియ్యా ఇవాళ ఛైర్మన్అయి కూచున్నాడు. మా నాన్న, రామనాథాయి తండ్రి, వీరాసామి కలిసి చిన్నప్పుడు నాలుగోక్లాసు చదివినవాళ్ళే. పరీక్షలయి స్కూలు తెరచిన మొదటిరోజున వీరాసామి పరీక్ష తప్పాడనీ, మిగిలినవాళ్ళు అయిదో క్లాసుకు వెళ్ళొచ్చునని మేష్టారు చెప్పారట. కాని ప్యాసు అయినవాళ్ళలో ఒకడు నిజంగా పరీక్షల్లో తప్పాడనీ అయితే అతగాణ్ణి అయిదోక్లాసుకు తోసేశారనీ ఆ రోజుల్లో చెప్పుకునేవారట. ప్యాసయిన పిల్లలంతా పైక్లాసుకు వెళ్ళుతుంటే వీరాసామి ఒక్కడూ దిగులుగా పాతక్లాసులో కూచునిపోయాట్ట

ఆ తరగతిక్లాసులో పరీక్షలుతప్పిన కుర్రాళ్ళు వున్నా వాళ్ళకాసంగతి అదివరకే తెలిసి మొదటిరోజున స్కూలు దాయలకేరాలేదు! ఏమయితే ఏం-వీరాసామిని పైక్లాసుకు నెట్టినవారు లేరుసరికదా అతను పరీక్ష తప్పాడన్న కబురు చెప్పినవాళ్ళూ లేక పోయారు!

వీరాసామి అనాట్నుంచి మరి స్కూలుకే రాలేదు. వీరాసామిని చదివించటం అతని తండ్రికి సుతరామూ యిష్టం లేదట. భార్య పోరుమీద చెప్పించాడట. తగినశాస్తి అయిందని కొడుకును తనతో పాటే పని చెయిస్తూ వచ్చాడు తండ్రి తదనంతరం వీరాసామి యజమాని అయినాడు.

మునిసిపాలిటీ ఎన్నికల్లో వీరాసామి కూడా పోటీచేశాడు. కొన్నేండ్లు పోటీపడి ఏపార్టీకి చెందని వీరాసామిని ఛైర్మన్ చేశారు! నిజంగా చెప్పుకోతగ్గ విషయం. జీవితంలో ఏ అవకాశమూ లేక తరతరాలుగా దానిలో కప్పలా జీవిస్తూ వచ్చినవాళ్ళ వ్యక్తి ఛైర్మన్ అయినాడంటే అతనిలో ఏదో విశేషం వుండితీరాలి. అదేమిటో చూద్దామని సినిమా థియేటర్ సన్మానసభకు వెళ్ళాను. తతంగం చాలా అయిపోయింది. ఛైర్మన్ కాగితం చదువుతూ తనని యెన్నుకున్న ప్రజలకు కృతజ్ఞత ప్రకటిస్తున్నాడు.

"పద్నాలుగు ఏళ్ళక్రిందట ఒకనాడు ఓ కుర్రాడు వచ్చెను. పిలచితిని, అతను'వద్దు' అని తల త్రిప్పెను. నే నాశ్చర్యపోయి 'ఏమని' విచారించితిని. నువ్వుయజమానివి. లెక్కచెయ్యవు క్రిందటిసారి వీధిలోపోయే వాళ్ళతో మాట్లాడుతూ పావుగంటపనిని అరగంటచేసితివి. నీ అసిస్టెంటు చాలు' అని చెప్పెను. ఆమాట నాకు చెంపదెబ్బవలె తగిలెను. బతిమాలి అతనిని కూచోపెట్టి చక్కగా నాకు చేతనైనంత బాగా క్రాపు చేసి పంపితిని. ఆ కుర్రవాని మాటలు నన్ను మార్చివేసినవి. ఇవాళ మీదయవల్ల ఛైర్మన్ అయినాను!"

"ఆ కుర్రాడెంతవాడయి వుండాలో!" అన్నాను నేను రామనాథాయితో కలిసి ఇంటికి వచ్చేస్తూ.

"నేనేవాణ్ణి!" అన్నాడు రామనాథాయి అంతవరకూ ఏమాటా మాట్లాడకుండా! వాడిమొహంలో ఆశ్చర్యమూ లేదు, గర్వమూలేదు!

□□□

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటినిత్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.





"నాకు మీ ఆఫీస్‌లో పనిచేస్తున్న వాళ్ళందరి ఇళ్లూ తెలియవు అన్నాయ్!"

పట్టుచీర కట్టుకొని, చేతిలో కుంకుమ భరిణ పుచ్చుకున్న అనసూయ కొత్తగా ఆఫీస్ మేనేజరుగా ప్రమోషన్ పొందిన సుందరంతో అన్నది.

"శంకరాన్ని పంపుతాను. నేను ఆఫీస్ కెళ్ళి! అతనొచ్చి అందరి ఇళ్ళూ చూపెడతాడు. అంచాకా నీకు తెలుసున్న వాళ్ళనందర్నీ పిలుచుకురా!" అన్నాడు సుందరం.

"శంకరాన్నా!" నిర్ఘాంతపోయింది అనసూయ. శంకరం మొన్న మొన్నటిదాకా, సుందరంతోపాటే ఆ ఆఫీసులో గుమాస్తాగా వుండేవాడు. సుందరం అదృష్టం కలి

ళొచ్చింది. ఇన్నాళ్ళూ గుమాస్తాగావున్న ఆ ఆఫీస్‌కే మేనేజరయినాడు. శంకరం ఇంకా శంకరగిరి మాన్యాలే దున్నుకుంటున్నాడు

"అవునమ్మా మన శంకరాన్నే." నిదానంగా "టై" కట్టుకుంటూ అన్నాడు సుందరం.

"మరి అతనికి ఆఫీసులో పనివుండదా?"

"పనివుంటే ఏం? వడ్డించేవాడు మనవాడయితే కడబంతిన కూర్చోమన్నారు పెద్దలు" గర్వంగా తనేదో ఉపకార చింతన వున్నవాడిల్లే అన్నాడు సుందరం.

అనసూయకి అయోమయంగా వుంది. శంకరం చేసేది బంట్రోతుపని కాదు. ఆఫీస్‌లో ఫైల్సు వ్రాయాల్సిన గుమాస్తా! అల్లాంటి గుమాస్తాని ఆఫీస్‌లో పనిచెయ్యాలసిన సమయంలో సెలవు పెట్టించి, తనతో పేరంటం పిలుచుకురావటానికి పంపుతానంటున్నాడు సుందరం. నడమంత్రపు సిరి, నరంమీద పుండూ అంటారు. ఇందుకే కాబోలు. నిన్నటిదాకా సుందరం, శంకరం చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ, వాళ్ళపై అధికారియొక్క నిరంకుశత్వాన్ని వేనోళ్ళ పొగుడుకుంటూ వుండినవాళ్ళే! అల్లాంటిది, ఈ రెండు నెల్ల మేనేజరుతనంలో సుందరానికి తను గొప్పవాణ్ణనే అహంభావం కళ్ళుమూసుకునేట్లు చేసిందంటే, కామ క్రోధ లోభమోహ మదమాత్సర్యాలను సృష్టించిన భగవంతుణ్ణి మెచ్చుకోతప్పదు. అనసూయ ఇరుగుపొరుగులని పేరంటం పిలవటానికి వెళ్ళింది శ్రీదేవి సోఫాలో కూర్చుంది పిల్లవాడు స్టాండు ఉయ్యాల్లో నిద్రపోతున్నాడు. శ్రీదేవికి పెళ్ళయిన పది సంవత్సరాలకి పిల్లవాడు కలిగాడు. వాడి జన్మదిన విశేషం వల్లనే సుందరానికి మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది. అంచేత వాడి పుట్టినరోజు గొప్పగా చెయ్యాలని సంకల్పించింది శ్రీదేవి. అంచేత పొరుగూరులో వున్న ఆడబిడ్డ అనసూయని పిలిపించింది. అనసూయభర్త ఒక ఎలిమెంటరీస్కూలులో టీచరుగా పనిచేస్తున్నాడు. అతను స్కూలుకి ఇనస్పెక్టరుగారు వస్తారని రాలేదు. అతను రాకుండా చెల్లాయి నొక్కదాన్ని పంపించినందుకు సుందరం అంతెత్తు యెగిరాడు.

"ఏమిటే అనసూ? తినగా తినగా గారెలు కనరెక్కాయిట వెనకటికి. అల్లా వుంది అతనిస్థితి. ఏం? వచ్చి ఈ నాలుగు రోజులూ ఇంట్లో వుండి, ఇంట్లోకి కావల్సిన నాలుగు సామాన్లూ తెచ్చిపడేయకూడదూ? నాకు నౌకర్లు లేకపోలేదు ఏదో ఇంట్లోమనిషి అంటే అదో నమ్మకం. పోయేటప్పుడు ఏదో ఒక పంచెగుడ్డ కొని పడేయనా ఏమిటి?" అన్నాడు. అనసూయ ప్రాణం చివుక్కుమనిపించింది. తనయితే ఏదో అన్నయ్యకు లేక లేక కలిగిన పిల్లవాడి పండుగకదా అని అయితేనేం. ఏదో ఇన్నాళ్ళకి అన్నయ్య పెద్ద హోదాలోకి వచ్చాడుకదా అని అయితేనేం వచ్చింది కాని, తనభర్తకూడా వచ్చి వీళ్ళకు కొలువు చెయ్యాలని వుందా? తన పుట్టింటి మమకారం ఆయన నెత్తిమీద కూడా ఎక్కడని రుద్దుతుంది? అనసూయ ఏమీ అనకుండా వూరుకొంది.

ఇటు అన్నగారిని అన్నా ప్రమాదమే ఏమన్నా అంటే ఏడాదికోసారి ఇంటికి పిల్చి రెండుచీరలు కొని యిచ్చేదికూడా మానుకుంటాడు. అటు భర్తని "ఏమండీ? పోనీ మా అన్నయ్యదగ్గరకు రాకూడదా? మనకి ఏదన్నా సాయం చేయకుండా వుంటాడా?" అంటే, "ఏం? మీ అన్నయ్యకి నౌకర్లు తక్కువయినారా? నువ్వెళ్ళి వాళ్ళని మెప్పించుకుని మేకతోళ్ళు కప్పుకు








వస్తున్నావు చాలటంలేదా?" అని కసురుకుంటాడు. అంచేత అనసూయ యెవర్నీ ఏమీ అనకుండా రోజులు గుట్టుగా గడపటం అలవాటు చేసుకుంది.

• • •

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. శ్రీదేవి బద్ధకంగా కళ్ళు విప్పింది. గదిలో ఒకమూల చాపమీద వుతికిన షర్టుపరిచి, చెంబులో కణ కణలాడే నిప్పుల్ని పోసి "చెంబిస్త్రీ" చేస్తున్న సుందరం కన్పించాడు. శ్రీదేవి హృదయం భగ్గుమంది కోపంతో.

"ఇంకా తెల్లారలేదు. అప్పుడే లేచి కూర్చున్నారెందుకో? చీకటిదయ్యమల్లే!" అంది.

"లేచి చప్పున కుంపటి రాజేసి కాఫీ నీళ్ళుపడెయ్యి. స్నానం చేసేశానులే!" నిదానంగా అన్నాడు సుందరం.

"ఇవ్వాళ ఆరింటికే రమ్మన్నాడా ఏమిటి మీఆఫీసరు!" అంది విసుగ్గా.

"ఈ ప్రశ్నలన్నీ ఒక కాగితంమీద వ్రాసివుంచు! సాయంకాలం తీరిగ్గా జవాబులు

కె. వి. ఎస్. అచ్యుతపల్లి

వ్రాస్తాను. ముందు నామీద దయవుంచి చప్పున ఇన్ని కాఫీనీళ్ళు వచ్చే ప్రయత్నం చేయి!" అన్నాడు సుందరం. శ్రీదేవి విసురుగా లేచి చెంబులూ గిన్నెలూ చప్పుళ్లు చేస్తూ, కుంపటిదగ్గర కూర్చుని టప్‌టప్‌మని కుంపటి విసురుతూ కూర్చుంది. ఇంతలో హడావుడిగా శంకరం వచ్చి "ఇంకా ఇల్లానే కూర్చున్నావుట్రాటయ్యా!" అంటూ అక్కడున్న మూడుకాళ్ళ కుర్చీమీద కూర్చున్నాడు

"ఏమిటండీ మహానుభావా! ఈరోజు ఏదన్నా జాతర జరుగుతున్నదా ఏమిటి!" శంకరాన్ని చూసి అడిగింది శ్రీదేవి.

"జాతరన్నమాటే అనుకోండి" శంకరం నవ్వుతూ అన్నాడు సుందరం నెమ్మదిగా చెంబిస్త్రీ చేసుకున్న షర్టుని తొడుక్కుని టకప్ చేసుకుంటూ.

"అయిందా కాఫీ! వేడికూడా కాసిని పొయ్యి." అన్నాడు.

"డికాక్షన్ తీయటం అయ్యింది. ఇంకా పాలది రాలేదు." అన్నది.

"పాలది ఒకనాడన్నా వేళకువచ్చేడిస్తేగా! పక్కావిడని కాసిని పొయ్యమను." అన్నాడు సుందరం.

"రోజూ నేను ఈ అప్పులకి తిరగలేను బాబూ! అంతకన్న ఈ కాఫీలు మానుకుంటే నయం. నెలకి ఇరవయి రూపాయలు కలిసొస్తాయి లేకపోతే బడాయిమీకుకావి!" శ్రీదేవి కోపంగా అంది.

"అల్లాగే మానేద్దాం! తరవాణీకుండ ఒకటి ఓపెన్ చెయ్యి. చలవైనా చేస్తుంది." అన్నాడు సుందరం.

"తరవాణీ కుండ ప్రారంభోత్సవానికి మన మానేజరుగార్ని అధ్యక్షులుగా వుండమనాలని నా ప్రతిపాదన" అన్నాడు శంకరం.

"మానేజరేం ఖర్మ! అహోరకాళ మూర్తుల్ని పిలిపిస్తే యింకాబాగుంటుంది." వెక్కిరింపుగా అంది శ్రీదేవి. ఇంతలో పాలది పాలు తెచ్చింది. పాలు పుచ్చుకుని, కాఫీ కలిపి యిద్దరికీ చెరోకప్పు యిస్తూ

"ఇంతకీ అసలుసంగతి చెప్పారుకాదేం! వశ్రోతవ్యమా ఏమిటీ!" అంది.

"అవశ్యం శ్రోతవ్యం! కాని చెప్పడం బాగుండదు అనుకోండి. కాని చెప్పకుండా వుండటం యింకా బాగుండదు. కనుక చెప్పక తప్పదు అని నా అభిప్రాయము" అన్నాడు శంకరం.

"ఏమిట్రా వెధవగోల! కాఫీలో పంచదార లేదే శ్రీదూ!" అన్నాడు సుందరం

"మీకాఫీకి నాలుగు కిలోల పంచదార కావాలి." అంది శ్రీదేవి.

"పాలు పలచగా వున్నప్పుడు యింకో రెండు చెంచాలు పంచదార యెక్కువ వేసుకుంటే, సానకం త్రాగామన్న తృప్తైనా మిగులుతుంది మరి." అన్నాడు సుందరం!

"అసలు టీలో పాలు పోసుకోరు." అన్నాడు శంకరం.

"వెధవ న్యూసెన్సు! ఉత్తిహాస్యాలజీ ప్రొఫెసరువు నువ్వు! పద! టైం అయిపోతోంది.' తొందర చేశాడు శంకరాన్ని సుందరం.

"ఉత్తి న్యూసెన్సు అంటే చాలదుట్రా వెధవ అనే విశేషణం కూడా యెందుకు! అదమ్మాయి. అగ్గి నిప్పు అన్నట్లు!" అన్నాడు శంకరం.

"సంతోషించాం నీ తెలివికి! నడు మహాదేవా!" సుందరం శంకరాన్ని బయటకు లాక్కుని పోయాడు

"సర్లెండి! సంగతేమిటో చెప్పకుండా పోతున్నారుకదూ!" అంది శ్రీదేవి వెనుక నించి.





"అదేనండి. మరేమో. మరేం -" అంటూ సాగతీయటం మొదలెట్టాడు శంకరం.

"మరేమో. మరేం! ఏమిటా నంగిరి పింగిరిమాటలూ!" విసుక్కున్నాడు సుందరం.

"అదేనండి! ఆవిడా - ఆవిడేమో!"

"ఆవిడా! ఆవిడెవరూ!" ముఖం చిట్లించింది శ్రీదేవి.

"ఆవిడంటే ఆవిడేనండి! చాలామంచి వారండి. మీలాగే నేను ఎప్పుడువెళ్ళినా వెండి గ్లాసుతోగ్లాసుడుకాఫీ ఇచ్చేస్తుందండి. పంచదారకూడా ఎక్కువగానే వేస్తుంది. వాళ్ళింట్లో కాఫీ చాలాబాగుంటుంది. ఏమంటే పాలు చిక్కనివి. పైగా కాఫీపొడరుకూడా చాలా ఖరీదు వాడుతారు." శ్రీదేవికినవ్వువచ్చింది.

"నేను కాఫీగురించి వర్ణనచెయ్యమన్నానా మిమ్మల్ని!" అంది. శంకరానికి తను చెబుతున్నదేమిటో అర్థం అయింది.

"ఆవిడంటే. అదే ఆ కాఫీ యిచ్చే ఆవిడ, మా ఆవిడకాదులెండి. కానిసాక్షాత్తూ మా ఆవిడకి డూప్లికేటు అనుకోండి. అదే కోపానికి! ఇంతకీ ఆవిడ మా మానేజరు గారి భార్యా రత్నం." అన్నాడు.

"సరే! ఇప్పుడు యింతకీ, మీరు తూర్పు తెల్లవారకుండా వెళ్ళి చేయాల్సిన ఘనకార్యమేమిటంటా!"

"అదే చెబితేతంటా!" సుందరం వేపు చూశాడు శంకరం. అప్పటికప్పుడే సుందరం సైకిలెక్కిపోవటం, ఆ వాహనం. ఆఘమేఘాలమీద ప్రయాణం చెయ్యటం కూడా చూసి భ్రాంతపోయాడు శంకరం. వెనకనించి

"శంకరం బాబూ!" అన్న పిలుపు వినపడటంతో వెనక్కి తిరిగాడు. ఆఫీస్ బంట్రోతు గురవాయి.

"ఏంటోయ్!" అన్నాడు శంకరం.

"అమ్మగారు చాలా బాధపడుతున్నారటండీ. మిమ్మల్ని వచ్చేటప్పుడు. టాక్సీ తీసుకురమ్మన్నారు మానేజరుగారు." అన్నాడు గురవాయి.

"వస్తానండీ వదినగారూ." అంటూనే సైకిలెక్కేసి వెళ్ళిపోయాడు శంకరం.

"ఏమిటో హడావిడీ!" అంది శ్రీదేవి.

---

● *వాటాకావాలని వచ్చినవాడితో ఇల్లుగలాయన: "మా ఆవిడకి చీమ చిటుక్కుమన్నా నిద్రపట్టదు. అంతా నిశ్శబ్దంగావుండాలి. మీకు పిల్లలున్నారా!"*

*"లేరు."*

*"రేడియోవుందా!"*

*"లేదండి"*

*"మీ ఆవిడ పాటలు పాడుతుందా!"*

*"ఉహు, అదేంలేదుగాని, అప్పుడప్పుడు నా పెన్నుమాత్రం రాసుకుంటే గరగరమంటుందండీ."*

"అమ్మగారునొప్పులుపడుతున్నారండీ!" అన్నాడు గురవాయి.

"అయితే ఏ "అయా"కో కబురంపితే సరిపోలా? ఈ మగధీరులెందుకు?"

"ఆ మేగారు చాలా కష్టపడతారంట పాపం!"

"పడితే పడతారుమరి. వీళ్ళేంచేయగల రటా?"

"ఈవూళ్ళో సుందరంగారంటే, శంకరం గారంటేపుట్టిపెరిగారుగందా? అంచేత ఈళ్ళకి వూళ్ళో ఏఁమంచి హాస్పటాలో తెలుస్తది కదాని పిలిపించారు. పైగా ఈరు కూడా మానేజరుగారి తల్లో నాలుకల్లా మసలుకుంటారు." అన్నాడు గురవాయి. శ్రీదేవి నణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

• • •

"జున్ను చాలా బాగుందే శ్రీదూ!" అన్నాడు సుందరం. శ్రీదేవి వాళ్ళ పుట్టిల్లు ప్రక్కనున్న పల్లెటూరు. వాళ్ళ గేదె ఈనిందట. పాలేరుచేత జున్ను పంపించారు శ్రీదేవి పుట్టింటివారు.

"ఇంకాస్త పెట్టనా?" అంది శ్రీదేవి. పంచదారా, మిరియప్పొడితో మహారుచిగా కుదిరింది జున్ను.

"వొద్దులే! నువ్వుతిన్నావా? ఇంకా ఎంతవుంది? గిన్నెచూపెట్టు!" అన్నాడు సుందరం. గిన్నె చూపెట్టింది. ఇంకా మూడువంతులువుంది అందులో.

"తెల్లగా, గడ్డలా భలే కుదిరింది." అన్నాడు. ఈ స్తోత్రపాఠం ఎందుకు వల్లె వేస్తున్నాడో శ్రీదేవికి తెలియందికాదు.

"దేనికి చెప్పండి!" అంది.

"వాళ్ళ అమ్మాజీకి జున్నంటే చాలా ఇష్టంట. మొన్న ఏదో మాటలసందర్భంలో చెప్పింది. కాస్త ఇద్దామనిపించింది." నెమ్మదిగా అన్నాడు.

శ్రీదేవి చర్రుమంది. అమ్మాజీ అంటే ఆఫీసు మానేజరుగారి మరదలు.

"ఎందుకండీ మీకీ ఆరాధన? కొత్తగా కాకారాయుళ్ళు అయిపోతున్నారు? ఉన్న మటుకు మీ ఎత్తులు, జిత్తులు తెలీకుండా వున్నారనుకున్నారా ఏమిటి?" అంది.

"మనకి షన్నదాంట్లో ఇంకొకరికి పెట్టటం, మంచిగా అవతలవాళ్ళని విమర్శించకుండా సర్దుకపోవటం ఎత్తులు, జిత్తులు అవుతాయా? ఏదో పెద్దాయన. గౌరవనీయుడు. ఏది యిచ్చినా తృప్తిగా స్వీకరిస్తాడు. మన మంచితనానికి మర్యాదకి సంతోషిస్తాడు." శాంతంగా అన్నాడు సుందరం.

"తేరగావస్తే నేనూ సంతోషిస్తాను. ఇంట్లోకి ఏదన్నా తేవటం భయం. ఆయనకి పట్టుకెళ్ళి ధారపోస్తారు. ఇంతాచేస్తే, మీకు ఆయనగారు ప్రమోషన్ఇచ్చేదీలేదు, చచ్చేదీలేదు. ఇద్దరం మనుష్యులం; మనకే పిల్లా, జెల్లా? ఎవరున్నారు? ఏదో నాలుగు డబ్బులు వెనకవేసుకుందామన్న ధ్యాసే లేదు. ఇంట్లో ఇలి, పైవాళ్ళకి బలి. లేనిపోని ఆడంబరాలకుపోయి ఆస్తమానం ఆఫీసరుగారి సంతని సినిమాలకు తీసుకెళ్ళా; టీపార్టీలు చెయ్యా; డిన్నర్లుచెయ్యా. ఎక్కణ్ణించి వస్తుందీ? మీతాతగారిముల్లే, మా తాతగారిముల్లే మూలిగి ఏడుస్తూండా ఏమిటి? ఇల్లా అయితే నేనీ సంసారం ఈదలేను బాబూ!" రుద్ధకంఠంతో అంది.

"అంత కోపమెందుకే శ్రీదూ? నువ్వయినా అంతా తినెయ్యలేవుకదా? ఎల్లానూ ఇరుగుపొరుగుకి కాస్త పెడతావుకదా? అందులోదే కాస్త ఇమ్మన్నానుకాని, అంతా పట్టుకెళ్ళిఇచ్చేస్తానా?" అన్నాడు సుందరం.



శ్రీదేవి మాట్లాడకుండా జున్ను అంతాతీసి, ఒక వెండిగిన్నెలో పెట్టి యిచ్చింది. ఇస్తూ "వెండిగిన్నె బాగుంది అంటారు వాళ్ళు! అంటే ఆ గిన్నెకూడా యిచ్చేసి రాకండి" అంది.

సుందరం నవ్వుకుని వెళ్ళిపోయాడు.

• • •

ఇవ్వాళ ఒంటిగంటకే వచ్చేశారేం శ్రీవారు? మీ ఆఫీసరుగారు వూళ్ళోలేరా?" సైకిలుదిగి స్టాండ్‌వేసి లోపలికి వస్తున్న సుందరాన్ని అడగబోతూ గుమ్మందగ్గర కారు ఆగటం, అందులోంచి ఒక రెండు జడల అమ్మాయి వయ్యారంగా దిగటం చూసి, నాలికని అదుపుచేసింది శ్రీదేవి. ఆ అమ్మాయిని ఆహ్వానించి చాపవేసి కూర్చోపెట్టింది శ్రీదేవి. సుందరం గోడ కానుకుని నిలబడ్డాడు.

"ఈ అమ్మాయి మన ఆఫీసరుగారి మరదలు, పేరు అమ్మాజీ. డాక్టరు కోర్సు చదువుతున్నారు. ఆస్తమానూ మిమ్మల్ని అడుగుతోనే వుంటుందండి మా ఆవిడ. ఏదీ, మీ అక్కగార్ని చూట్టానికి వద్దామనుకుంటాండి, నన్ను రోజూ తీసుకెళ్ళండి! అని అడుగుతోంటుంది. నాకు తీరుబాటు లేక తీసుకరావటం లేదు." అన్నాడు సుందరం.

ఆ అమ్మాయిలేచి చిన్నగా నవ్వుతూ, శ్రీదేవి ముఖాన బొట్టుపెట్టి, "రేపు మా అక్కయ్యగార్ని ఉయ్యాల్లో వేస్తారు. తప్పకుండా పేరంటానికి రండి." అన్నది.

ఆ అమ్మాయి కట్టుకున్న టెకరాన్ చీర వేపు తీక్కగా చూస్తూ నిలబడింది శ్రీదేవి.

"కాస్త టీ ఇయ్యవే శ్రీదూ!" అన్నాడు సుందరం. శ్రీదేవి గబగబా లోపలికివెళ్ళి థరకోసరం పాస్కులో పోసుంచిన, టీని రెండుగాజుగ్లాసుల్లోకి వొంపి తెచ్చి ఇద్దరికి చెరొక గ్లాసూ ఇచ్చింది.

"నాకు టీ అలవాటు లేదండీ. ఒక్కసారి పుచ్చుకున్నానంటే, స్లీపింగ్ టాబ్లెట్స్ వేసుకుంటేకాని, రాత్రిళ్ళు నిద్రపట్టదు. ఆ టాబ్లెట్స్ వేసుకుంటే గుండెకి మంచిది కాదుట" అన్నది అమ్మాజీ.

"అయితే మధ్యాహ్నం మీరేం పుచ్చుకుంటారు?" ఆదుర్దాగా అడిగాడు సుందరం.

"పోర్ ధర్టీకి డ్రింకింగ్ చాకొలెట్ తీసుకుంటాను" అన్నది అమ్మాజీ.

"ఒక్కనిమిషం కూర్చోండి. ఈలోగా మీరేదయినా మాట్లాడుతూవుండండి" అని భర్తతోనూ, అమ్మాజీతోనూచెప్పి ప్రక్కవాటాకొనికి వెళ్ళింది.

"నాగురించి శ్రమతీసుకుంటున్నారు వీన్నిగారు" అన్నది అమ్మాజీ.

"దానిదేముంది లెండి. ఇంతకీ మీరు హిందీసాంగ్స్ లైక్‌చేస్తారా, లేక తెలుగు సాంగ్స్ లైక్‌చేస్తారా?" అంటూ తన

---

● *ఏటేటా పురుడుపోసుకుంటున్న అరడజనుమంది పిల్లల తల్లిని పక్కింటావిడ అడిగింది!*

*"ఎన్నో నెలమ్మా ఇప్పుడు!"*

*"ఇకనుంచీ నెలాలేదు గిలాలేదు. ఏటా పురుడెందుకొస్తోందో మాకు తెలిసిపోయింది."*

పెళ్ళికి అలకపాన్పుమీద తన మామగారు కొనిచ్చిన మూడువాల్వులు, రెండుబ్యాండులు గల రేడియోలో, "వివిధ భారతి"ని ట్యూను చేశాడు సుందరం. శ్రీదేవి ప్రక్కవాటా వారి అబ్బాయిని బ్రతిమాలుకొని, ఒక అర్ధ రూపాయి చాకొలెట్ బిళ్ళలు కొని తెప్పించింది. ఒక స్టైయిన్‌లెస్ పళ్ళెంలో పెట్టి తెచ్చి అమ్మాజీకి ఇచ్చింది. అమ్మాజీ ముందు తెల్లబోయింది. తర్వాత తనలో తనే నవ్వుకుంటూ ఆ చాకొలెట్లుతిని కాసిని మంచినీళ్ళు త్రాగింది.

"ఇంక వెళ్ళవస్తాను. రేపు పెంద్రాళే వచ్చెయ్యండి."

అని కారుదగ్గరికి నడిచింది సుందరం కూడా వెనకాతలే వెళ్ళటంచూచి "మీరు మళ్ళీ వెళ్ళిపోతున్నారా ?" అన్నది శ్రీదేవి.

"వుష్! అరవకు. ఇంకా నూటయాభై ఇళ్ళలో పిలవాలి" దగ్గరగావచ్చి అన్నాడు సుందరం చేతిలోని లిస్టుచూస్తూ.

"అయితే సైకిలు అట్టేపెట్టి వెళ్ళండి. ప్రక్కవాటావారి రామంచేత నాలుగు కిలోల బొగ్గులు తెప్పించుకుంటాను. ఇంట్లో ఒక్క బొగ్గుముక్క లేదు. పొయ్యిమీదకి లేవు! పొయ్యిలోకి లేవు! నే నెల్లా వండి వార్చతాను ?" అంది శ్రీదేవి విసుగ్గా.

"సైకిలు కూడా విడిచి నే నెల్లాపోతానే, అక్కడో ఇల్లూ, అక్కడో ఇల్లూ తగలడ్డాయి! ఇవ్వాళకి ఎల్లాగో అల్లాసర్దుకపోదూ. నీకు దండంపెడతాను" లాలింపుగా అన్నాడు సుందరం.

"ఆఁ సర్దుకపోతాను మిమ్మల్ని కట్టుకోటమే నా బ్రతుక్కి సరుకపోవటమయింది. రోజూ నేను సర్దుకపోతూంటే, తెల్లారేసరికి మేకువుతెచ్చి నెత్తికెత్తుతానంటారు మీరు! ఎల్లా చచ్చేది దేముడా!" ఉక్రోషంగా అంది శ్రీదేవి.

"పూరుకోవే దేవతా! అమ్మాజీ వింటే ఏమన్నా అనుకుంటుంది" ప్రాధేయపడుతూ అన్నాడు సుందరం.

"ఎందుకనుకుంటుందేం! అంతగా మీరే ఇళ్ళన్నీ చూపించాలని వుంటే కారులో తీసుకపోకూడదా యేం ?"

"పూరుకోమంటున్నా కాదుటే బాబూ! ఇవ్వాళ నీకు ఎంత రాత్రయినా సరే, బొగ్గులూ, బియ్యం తెచ్చిపడేస్తాను. సరేనా!" విసుగ్గా అంటూ బయటకు వెళ్ళాడు సుందరం.

మొత్తానికి సుందరం మేనేజరుగారికి చేసిన పూజ బొగ్గులపూజకాలేదు. అతని పూజాఫలంవల్ల మేనేజరుతనం వచ్చింది. మేనేజరు ట్రాన్స్‌ఫర్ అవగానే సుందరానికి ప్రమోషన్ ఆర్డరు వచ్చింది. ఈవార్తకి అతని సహచరులు అంతా సంతోషించారు. ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. శంకరం అధ్యక్షోపన్యాసం చాలా ఉద్రేకంగా చేశాడు.

"మనువంటే మేనేజరనబడే వ్యక్తి పైనుంచి రావటంవల్ల మనతో కలియకుండా తనేదో ఏడుకొండలవాడిలా పోజులిస్తూ కూర్చుని, మన్ని వేపుకుతినేవాడు. కాని నేడు మన మేనేజరుగా, ఇన్నాళ్ళూ మన సహబాధితుడుగా వున్న వ్యక్తి అవడంచేత అతనికి మనపట్ల సంపూర్ణ సానుభూతి వుంటుంది. మన భవిష్యత్తు అంతా ఆశాజనకంగా వుంది. మనమంతా ఒకే కుటుంబం వాళ్ళం. ఇనుక మనకిక నిశ్చింత" అంటూ చెప్పుకుపోయాడు. గుమస్తాలంతా మిన్నుముట్టేట్లు కరతాళ ధ్వనులు చేశారు ఒక భావకవి "అందరం, మన మందరం, సుందరం అందలం ఆరోహణం చూసి విస్మితులం, మందస్మితులం, దరహసితులం" అంటూ అతుకవిత్వంగా పాడాడు. అతని ఖండకావ్యం అప్పటి కప్పుడే గుమాస్తాలందరిలోనూ మంచి ప్రచారం సంపాదించింది. ఇంకొక ఆధునిక కవిత్వరీతుల్ని ఆకళింపు చేసుకుంటున్న పిల్లకవి జపాను భాషలో వ్రాయబడే హౌక్కుల పద్ధతిలో అప్పటికప్పుడు

"సుందర్!

పెదవులపై లాస్యంచేసే నగవులుగల ఆఫీసర్!

ఇహమీదట మా భయాలన్నీ నీ సమక్షంలో ఖబాదూర్!"

అని వ్రాసిన చీటీ గులాబీపూలగుత్తిలో పెట్టి సుందరానికి ఇచ్చాడు. సుందరం వినమ్రంగా తలవంచి స్వీకరించాడు అది ప్రక్కనే కూర్చున్న శంకరం చదివి అందరికీ విన్పించాడు. చివరికి తెలిసిందేమంటే సుందరం పదవీస్వీకరణవల్ల పిల్లకాకులన్నీ కోకిలలుగా పరివర్తనం చెంది పంచమస్వరంలో ఆనందగీతాలు ఆలాపించాయి.

శ్రీదేవికి మునపటికి మల్లే చీటికిమాటికి కోపం రావటంలేదు. మితంగా మాట్లాడటం ఆమితంగా భక్ష్యపానీయాదులందు శ్రద్ధ తీసుకోవడం అలవాటు అయింది. మానేజరు భార్య అయినాక శ్రీదేవికి తెలుగు తిండి, తెలుగుభాష, తెలుగుసినిమాలు అంటే గిట్టటంలేదు. ఆవకాయలు, కందిపొడులు, గోంగూర పచ్చడీ మొదలైనవి, ఆమెకి మోటు తిళ్ళుగా కనపడుతున్నాయి. వని

---

● *ఒక గానసభలో గాయకుడిని ఒక పెద్దమనిషిలేచి సినిమాపాటలు పాడమని కోరాడు.*

*ఆ గాయకుడు వెంటనే 'మూగమనసులు'లోని పాట పాడాడు.*

*'ఇంకా పాతది పాడండి' అన్నాడాపెద్దమనిషి.*

*'మాయాబజారు'లోని పాట అందుకున్నాడు గాయకుడు.*

*'అబ్బే! ఇంకాపాతది!' అన్నాడు.*

*కొంచెం విసుగుతోనే ఆపాట ఆపి 'బాలరాజు'లోది మొదలుపెట్టాడు!*

*'ఏం అనుకోక ఇంకా పాతపాట పాడండి! వినాలనివుంది!' అన్నాడు పెద్దమనిషి.*

*గాయకుడికి ఒళ్ళు మండిపోయింది. మాట్లాడకుండా ఊరుకున్నాడు!*

*'పాడరేం' అన్నాడతడు.*

*"ప్రస్తుతం నేను పాడుతున్నది బాగా పాతపాట! మొట్టమొదటి మూకీ చిత్రంలోనిది!" అని సమాధానమిచ్చాడు గాయకుడు*

—ద్విభాష్యం రాజేశ్వరరావు.
యలమంచిలి.

పిల్లలు మొదలు పనివాళ్ళవరకూ. ఆమె ఇంగ్లీష్‌లో మాట్లాడటం చూసి విస్తుపోయే వారు. ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడటం కోసం ఆమె ప్రత్యేకంగా ఒక ట్యూటర్‌ని నియమించుకుంది. సుందరం కాపుఆగగానే. ఆమె "శ్రీదేవినీ. నీదుదేవేరినీ" అని పాడుతూ స్వాగతం ఇస్తుంది.

"కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు చూశావా ?" అనేవాడు సుందరం.

"అందుకనే వర్క్. వర్క్. వర్క్" అన్నా రెవరో శ్రీదేవి వంతపాడేది.

● ● ●

"అర్జంటుగా పదవే ! ఇంటికి తాళం వెయ్యి" అన్నాడు శంకరం పార్వతితో, మధ్యాహ్నం రెండుగంటలయింది. ఎండ నిప్పులుచెరుగుతోంది. అల్లాంటి వేళ భర్తరాక చూసే ఆశ్చర్యపోతూంటే, తన్నుకూడా బయలుదేరమంటంచూసి ఇంకా విస్మితురా లయింది పార్వతి.

"ఎక్కడికి !" అంది.

"సుందరం ఇంటికి." అన్నాడు.

"ఎందుకు ?"

"ఏమిటా చొప్పదంటు ప్రశ్న ! చప్పున రెమ్మంటుంటే !" విసుక్కున్నాడు శంకరం.

"కారణం లేందే దేనికీ ఎండలో ?"

"రేపు వాడికొడుకు పుట్టిన రోజుట. అందుచేత ఇంట్లో పండిపంటలకి పిన్నా, బయట సర్దటాలకి నన్నూ రమ్మన్నాడు."

"ఏం వంటవాళ్ళని పెట్టుకోకూడదా ! అన్నింటికీ మన్ని పిలుస్తారు దేనికి ? మన మేమన్నా పనివాళ్ళమా ?" కోపంగా అంది పార్వతి.

"అదేంమాట ! మేమిద్దరం చిన్నప్పట్నించీ స్నేహితులం కనుక చనువుగా పిలుస్తాడు వాడికి నౌకర్లులేకనా"

"అవునవును పాపం. ఆప్తమిత్రులు ! అందుకనే. ఆయనకి ప్రమోషన్ వచ్చిఆర్నెల్లయినా. మీ సీటు అరంగుళమన్నా కదల లేదు. సిగ్గులేకపోతేసరి ముఖానికి ! వూళ్ళో అందరూ "ఆఫీసరు ఇంటిచుట్టూ తిరుగుతాడు. ఆయన్ని బుట్టలోవేసుకుందుకు ప్రయత్నంచేస్తున్నాడు. అనుకోవటం మంచి వెళ్ళి అక్కడ ఆప్యాయతగా పలకరించే దిక్కన్నా లేకపోయినా అడవాచాకిరీ చేయటం దేనికి ఈ శ్రమ చెప్పండి !" పార్వతి బాధగా అంది.

"లోకులు ఏవో అనుకుంటారు లెద్దూ. నువ్వు చప్పున తెములు. ఈ రోజు అందుకనే సెలవు తీసుకువచ్చాను. సుందరం వెంటనే ఇచ్చాడు సెలవు."

"వెంటనే ఇచ్చాడు. పాపంఎంతదయ మీ మీద ?

తనపని కనుక యిచ్చాడు. అదే మనం మాట్నీకి పోతామంటే యిస్తాడా సెలవు ?" అంది పార్వతి.

"ఆదీ చూద్దాంకాని ముందు నువ్వుపద!" అన్నాడు శంకరం.

● ● ●

"పండక్కి పదిరోజులెందుకోయ్ సెలవు ?" అన్నాడు సుందరం పదిరోజులు సెలవుకోసం దరఖాస్తు పెట్టిన శంకరాన్ని.

"అబ్బే. పండక్కికాదు. మాచెల్లాయి పెళ్ళి ఒకటవుంది. దానికి పనులూ అవీ చేసుకోవాలి" నెమ్మదిగా అన్నాడు శంకరం.

"మీఇంట్లో బోలెడుమంది బంధుజనం వుండగా. నువ్వే చేయాల్నా ఏమిటిపనులు! అసలు నీకు ఆఫీసు పనంటే ఇద్దకం తలిసి





పోతోంది" అన్నాడు సుందరం. శంకరం బిక్కచచ్చిపోయాడు. అయినా నిదానంగానే

"మానాన్నగారు పెద్దవారైపోయారోయ్ మరి. అన్నిటికీ ఇంట్లో నే నొక్కణ్నేగా చెయ్యవలిసినవాణ్ని" అన్నాడు.

"అయితే. ఏ కాజుయల్‌లీవు ఈ సంవత్సరానికి అయిపోయిందికనుక జీతనష్టం మీద లీవు తీసుకో ;" అన్నాడు సుందరం

శంకరం నిర్ఘాంతపోయాడు. తనకిచ్చే వందరూపాయల్లోనూ, పదిరోజులజీతం నష్ట పోతే, తనకి వచ్చేనెలంతా ఎల్లాగడుస్తుంది; నిజానికి కాజుయల్‌లీవు అంతా సుందరం ఇంటిపనులకోసమే వాడాడుకద తను ! అది సుందరం యెందుకని గ్రహించుకోడు ;

బరువుగా కాళ్ళీడ్చుకొంటూ మేనేజరు రూంలోంచి ఇవతలికివస్తున్న శంకరాన్ని హాల్లోకూర్చున్న గుమాస్తాలంతా పరామర్శించారు. విషయం అందరికీ విశదపర్చాడు శంకరం.

"నీ లోకువచూసి తెగ చేయించు కున్నాడు" అన్నాడు ఒకడు.

"ఆఁ ఎప్పుడూ గీర్వాణమే వాడికి!" ఇంకోడు ధ్రువపరిచాడు.


"వాడి పెళ్ళాం ఇప్పుడు దొరసానమ్మ అయిపోయింది!" ఇంకో బ్రహ్మచారి గొణుక్కున్నాడు.

"ఇదంతా నా ఖర్మ!" శంకరం నిర్వేదంగా అన్నాడు.

"ఖర్మ సిద్ధాంతం కట్టిపెట్టుశయ్యా! తొందమదిరితే ఊసరవెల్లి అయి రంగులు మారుస్తుందట! అల్లావుంది వీడివ్యవహారం వాడింట్లో పిల్లిపిల్లఛస్తే మనమంతా పూడిగం చేయాలంటాడు. ఎవడుచేస్తాడు! నువ్వు మామూలుగా ఎర్న్డ్ లీవుపెట్టివెళ్ళిపో! వాడుకనుక జీతంకోసేస్తే, మేమంతా సమ్మె చేస్తాం. కుదురుతుంది వాడి తలతిక్క! నడమంత్రం సిరి. నరం మీద వుండూ అన్నట్లు వుంది వాడి వరస!" ఇంకో విప్లవవాది సలహా చెప్పాడు.

అందరూ మెల్లిగా ఆఫీస్‌వదలి బయటికి వచ్చారు. ఆఫీస్ ఆవరణలో ఒక కాకిచచ్చి పడుంది. ఆ చచ్చిన కాకి చుట్టూ చేరిన కాకులు గోలగా అరుస్తున్నాయ్. అయినా ఏదేవుడూ ఆకాకికి ప్రాణం పొయ్యడు.

000






# నా కోసము

సత్యాదేవి వీణ వాయిస్తోంది.

హిందోళరాగం ఆలాపిస్తోంది ఆమె - శ్రీకృష్ణునికి ప్రియమైన రాగము హిందోళ. ఈ ఉదయము అద్భుతంగాపలుకుతోంది వీణ. శిశిరఋతువును వీడ్కొలిపి, వసంతాన్ని ఆహ్వానిస్తూ ఏవేవో వింత వింత రాగచ్ఛాయలను స్ఫురింపజేస్తున్నాయి వీణ, పైన వింతగా నాట్యమాడుతూన్న సత్యభామ వ్రేళ్ళు.

చటుక్కున వీణా వాదమును ఆపింది సత్య.

ఎదుట కూర్చున్న శ్రీకృష్ణుడు ఆమె సంగీతాన్ని వినడంలేదు.

అతడేమో పరధ్యానంలో మునిగిపోయాడు వాద్యమును వింటూవింటూనే. సత్య ముఖం చిట్లించుకుంది. కాని, వెంటనే తేరుకుని వేదికనుండి దిగివచ్చి, నాథుని భుజాన చేయిఉంచి, అనునయిస్తూ అడిగింది "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని.

శ్రీకృష్ణుడు పలుకలేదు.

సత్య మళ్ళాఅడిగింది. ఈసారి మరింతగా బుజ్జగిస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు? చెప్పరా?" అని.

ఆమెకేసి ఎంతో ఆదరంగాచూస్తూ అన్నాడు శ్రీకృష్ణుడు "ఏమీలేదు సత్యా!" అని.

సత్య నమ్మలేదు. చెప్పక తప్పదంది పట్టుదలతో.

దూరాన ఆకాశాన్ని అంటుతూన్న పూచిన పున్నాగ వృక్షపు చిటారికొమ్మల పైన దృష్టినిలిపిఉన్న శ్రీకృష్ణుడు అన్నాడు "ఇందుమతి, పాపము చాలాబాధపడుతోంది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది, ఇంపా, పాపము!" అని.

సత్యాదేవి విశాలనేత్రాలు ఈర్ష్యాకషాయితములు కాలేదు. కాని, ఆమె చెక్కిళ్ళపైన గులాబీలు మరింత ఎర్రనైనవి.

"ఇందుమతి ఎవరూ?" అని ప్రశ్నించింది సత్య, సాధారణస్వరంతోనే

ఒక్కక్షణం ఆగి, శ్రీకృష్ణుడు ప్రత్యుత్తర మిచ్చాడు! "నేను వ్రేపల్లెలోవుండగా పన్నెండేళ్ళ బాల. సుగుణపాలుని కూతురు—"

"గొల్లపిల్లా!" అంటూ, అతని మాటకు అడ్డము వచ్చింది, సత్య.

"అవును; గొల్లపిల్లే; మా అందరితోనూ బృందావనములో ఆడుకునేది. బంగరపు బొమ్మ; చక్కని కంఠస్వరము ఆమెది, ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉండేది. ఆబాల ఇప్పుడు నవయౌవన అయినది ఆమె పెండ్లికై పెద్దవారు తొందరపడుతున్నారు"

"ఆమె కిష్టంలేదు పెండ్లిచేసుకోవడం. అంతేనా?" అన్నది సత్య. కాస్త కటువుగానే కాని మరుక్షణము. ఆమె గొంతుక మారింది. శ్రీకృష్ణుని కన్నులలోని కరుణ